క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



రైతులకు అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్ రమేష్

గుడిబండ: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ రమేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చిగతుర్పికి చెందిన రైతులకు నవధాన్యాల సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. రమేష్ మాట్లాడుతూ పీఎమ్‌డీఎస్ పద్ధతిలో నవధాన్యం సాగుతో రైతులకు ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయన్నారు. 20 సెంట్ల భూమిలో 30 రకాల ఆకుకూరలు, కూరగాయలు, పూలు, పండ్లు తదితర పంటలను సాగు చేసి రోజూ మంచి ఆదాయాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ హనుమంతరాయప్ప, ఎల్‌సీఆర్‌పీ లలితమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

24న గిరిజా కల్యాణం

మడకశిర: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 24న పట్టణంలోని షిర్డిసాయిబాబా ఆలయంలో గిరిజా కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకూ రేకులకుంట శేషాద్రిస్వామి ఆధ్వర్యంలో ఈ కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే బుధవారం మహాశివరాత్రి సందర్భంగా దత్తబాణ లింగేశ్వరస్వామికి ఉదయం 7 నుంచి రుద్రాభిషేకం, అర్చన తదితర సేవలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి

పెనుకొండ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి పద్మమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆమె మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పద్మమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం, నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. మంచినీటి వసతి, ఇతర అవసరాలు పిల్లలకు అందుబాటులో ఉన్నాయా? లేదా అన్న విషయాన్ని పరిశీలించారు.

మిల్లు ఎదుట కార్మికుల ధర్నా



ప్రీకాట్ మిల్లు గేటు వద్ద ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

పరిగి: ఎన్నో ఏళ్లుగా వందలాది మంది కార్మికుల కుటుంబాలకు అండగా నిలిచిన కొడిగెనహళ్లి ప్రీకాట్ స్పిన్నింగ్ మిల్లు యూనిట్‌ను కాపాడుకుందామని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కనిశెట్టిపల్లి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మిల్లు గేటు ముందు కార్మికులతో కలిసి ధర్నా చేశారు. వినోద్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు పనులు నిలిపివేయడం, కొన్ని డిపార్ట్‌మెంట్లలో రన్ అవుట్ చేయడం వంటి వాటిని మిల్లు యాజమాన్యం అవలంబిస్తుండటం సరికాదన్నారు. మిల్లును యథావిధిగా కొనసాగించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు గంగాధరప్ప, ప్రధాన కార్యదర్శి మారుతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఇళ్లు, స్థలాలపై విచారణ



ఇంటి స్థలంపై విచారణ చేస్తున్న అధికారులు

రొద్దం: మండల కేంద్రంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారుల ఇళ్లు, ఇంటి స్థలాలపై శుక్రవారం రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. పట్టాలు పొందిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టారా? లేక ఇళ్ల స్థలాలు అమ్ముకున్నారా? అన్న వాటిపై ఆరా తీశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అగళి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మార్చి 1వ తేదీ నుంచి 17 వరకూ జరగనున్న ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ సుబ్బరావు, ఎంఈఓ చంద్రశేఖర్ శుక్రవారం తనిఖీ చేశారు. మౌలిక వసతులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. అగళి, రొళ్ల మండలాల నుంచి 339 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ప్రిన్సిపాల్ మంజునాథ తెలిపారు.

ఆశాజనకంగా మొక్కజొన్న



రొద్దం మండలం చిన్నకోడిపల్లి వద్ద ఏపుగా పెరిగిన మొక్కజొన్న

- ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా
- మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలంటున్న రైతులు

రొద్దం: మండలంలో మొక్కజొన్న సాగు ఆశాజనకంగా ఉంది. మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలో ఈ సీజన్‌లో దాదాపు 2 వేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారు. అన్ని భూముల్లో మంచి దిగుబడులు వస్తాయని వ్యవసాయ అధికారులు సూచించడంతో మొక్కజొన్న సాగుకు రైతులు మొగ్గుచూపారు. యాంత్రీకరణ వల్ల సాగు కూడా సులభతరం అయింది. అన్నదాతలు ఒక్కో ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు అంచనా వేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటా ధర 2,200 పలుకుతోంది. ఈ లెక్కన ఆదాయం కూడా బాగుంటుందని చెబుతున్నారు.

సాగు సులభతరం

ఇతర పంటల కంటే మొక్కజొన్న సాగు సులభతరం అవడంతో పాటు ఎరువుల వినియోగం కూడా తక్కువ. పంట కాలం 120 రోజుల కాగా... సాగుకు మూడు నుంచి నాలుగు విడతలు నీరు సరిపోతుంది. వరి పూర్తయిన తర్వాత మాగాణి భూముల్లో రెండో పంటగా మొక్కజొన్నను సాగు చేసుకుంటే సులువుగా ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. వరికి ఎక్కువగా ఎరువులు వాడివుంటారు కాబట్టి అది మొక్కజొన్నకు కూడా ఎంతగానో ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

ధర తగ్గకుండా చూడాలి



నేను నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాము. నెల రోజుల వ్యవధిలో పంట కాలం పూర్తి అవుతుంది. ఎకరాకు 35 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాము. చేతికి పంట రాగానే ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలి. ధర తగ్గకుండా, దళారుల నుంచి మోసపోకుండా ప్రభుత్వంతో పాటు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నరసింహారెడ్డి, రైతు, చిన్నకోడిపల్లి

దళారుల నుంచి కాపాడాలి



నేను మొక్కజొన్న పంటను సాగు చేశా. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. బహిరంగా మార్కెట్‌లో ధర బాగానే ఉంది. రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండాలంటే ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. దళారుల నుంచి మోసపోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి.

– యల్లారెడ్డి , రైతు, రాచూరు

మాతృభాషను కాపాడుకుందాం



హిందూపురం: మాట్లాడుతున్న ఎంఈఓ గంగప్ప

చిలమత్తూరు (హిందూపురం): మాతృభాషను ప్రతి ఒక్కరూ ప్రేమించాలని, భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హిందూపురం ఎంఈఓ గంగప్ప అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తల్లిని ఏవిధంగా గౌరవిస్తామో అదే విధంగా మాతృభాషను గౌరవించాలని ఎంఈఓ సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం రమాదేవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండలంలోని నీలకంఠాపురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. హెచ్ఎం హరిప్రసాద్ మాతృభాషా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. టెన్త్ విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిలీల, మురళీధర్, రామాంజినేయులు, మారుతీకుమార్, పీఈటీ రాజేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

పెనుకొండ: ఏపీజీఈఏ ప్రథమ కౌన్సిల్ మహాసభను విజయవంతం చేయాలని ఏపీసీపీఈఏ, ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పాలేల రామాంజినేయులు యాదవ్ పిలుపునిచ్చారు. మహాసభ కరపత్రాలను శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఏపీజీఈఏ ప్రథమ కౌన్సిల్ మహాసభ మార్చి 2న ధర్మవరంతో జరగనుందని సభకు ప్రతి ఉద్యోగి మద్దతు తెలపాలన్నారు. సీపీఎస్, ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలపై త్వరలోనే ఉద్యమ కార్యాచరణ చేపట్టడం జరుగుతుందన్నారు. నాయకులు ప్రభాకర్, హరి, మల్లికార్జున, నీలం అశోక్, రామ్‌ప్రసాద్, రంగేష్‌కుమార్, రామాంజినేయులు, బాలు, సజ్జరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మడకశిర: నియోజకవర్గంలో శుక్రవారం సాయంత్రం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు విస్తృతంగా దాడులు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సునంద, ఎక్సైజ్ సీఐ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో దాడులు చేసి అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గుడిబండ మండలం దిన్నేహట్టిలో మహాలక్ష్మి నుంచి 25, గుడిబండ మండలం ఎస్ఎస్ గుండ్లులో ఈరన్న నుంచి 50, రొళ్ల మండలం కాల్వేపల్లిలో నరసింహమూర్తి నుంచి 55 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే అగళి మండలం దొక్కలపల్లిలో గోపిని అరెస్ట్ చేసి అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



పెనుకొండ నుంచి అనంతపురం వెళ్లే రహదారి పక్కనే ఉన్న పురాతన బావి

పెనుకొండ రూరల్: పెనుకొండ నుంచి అనంతపురం వెళ్లే ప్రధాన రహదారిపై తిమ్మాపురం సోలార్ పరిశ్రమకు ఎదురుగా పాత బడిన బావి ఉంది. నూతనంగా రోడ్డును నిర్మించినప్పటికీ అధికారులు అక్కడ ప్రమాద సూచిక ఏర్పాటు చేయలేదు. నిత్యం వందల సంఖ్యలో ఈ రహదారిపై వాహనాలు తిరుగుతుంటాయి. రాత్రి సమయంలో వాహనాలు అదుపు తప్పి బావిలో పడే అవకాశం ఉంది. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకముందే సంబంధిత అధికారులు ఈ ప్రాంతంలో ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

అంకెల గారడీగా 'పురం' మున్సిపల్ బడ్జెట్

- 15వ ఆర్థిక సంఘం నిధులన్నీ అమరావతికి మళ్లిస్తే ఎలా?
- గొల్లపల్లి రిజర్వాయర్ బకాయి రూ.98 కోట్లు ఎందుకు చూపలేదు
- మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో మండిపడిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు



మున్సిపల్ చైర్మన్ రమేష్‌కు డీసెంట్ నోటీసు ఇస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ బడ్జెట్ సమావేశం రసాభాసాగా సాగింది. అంకెల గారడీ తప్ప బడ్జెట్‌లో ఏమీలేదని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మండిపడ్డారు. అసలు బడ్జెట్ మిగులు లేకపోతే ముగింపు నిల్వ, ప్రారంభ నిల్వలు ఎలా పొందుపరుస్తారని ప్రశ్నించారు. 15వ ఆర్థిక సంఘం నిధులన్నీ అమరావతికి మళ్లించి పురం అభివృద్ధిని గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం వార్డుల సంక్షేమం కోసం ఒక్కో వార్డుకు రూ.20 లక్షలు కేటాయిస్తే వాటిని కూడా మళ్లించారని విమర్శించారు. మున్సిపాలిటీ నుంచి చెల్లించాల్సిన బకాయిలు రూ.83.30 కోట్లు చూపించారని, గొల్లపల్లి రిజర్వాయర్‌కు సంబంధించిన రూ.98 కోట్ల బకాయి ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు. ప్రజలకు తప్పుడు సమాచారం ఇచ్చి మోసం చేయాలనుకోవడం దారుణమన్నారు. రూ. 2025–26 ఆర్థిక సంవత్సరం సంబంధించి రూ.68.09 కోట్ల బడ్జెట్ రూపొందించారని, ఇది కేవలం అంకెల గారడీ మాత్రమేనన్నారు. ఏడాదికి మున్సిపాలిటీకి రూ.30 కోట్లు ఆదాయం ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ డబ్బును ఇతర వాటికి వినియోగించుకుంటున్నారని, వార్డుల అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు.

రూ.1.52 కోట్ల పనుల ఆమోదానికి యత్నం

ఓ కాంట్రాక్టర్‌కు సంబంధించిన రూ.1.52 కోట్ల పనులకు టెండర్ ఆమోదం కోసం కౌన్సిల్ ఆమోదానికి ఉంచగా ఫ్లోర్‌లీడర్ ఆసిఫుల్లా కౌన్సిలర్లతో కలిసి ఆక్షేపించి డీసెంట్ నోటీసును చైర్మన్‌కు అందించారు. కౌన్సిలర్ శివ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో కొత్త పైప్‌లైన్ నిర్మాణానికి టెండర్‌ను ఒకే వ్యక్తికి అంచనాల కంటే అదనంగా 4.5 శాతం అదనంగా చెల్లించేందుకు అధికార పార్టీ భారీ అవినీతికి తెరతీసిందని విమర్శించారు. మున్సిపాలిటీ నిధులను అంత పెద్ద మొత్తంలో ఒకే వ్యక్తికి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల వేసిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక చైర్మన్ సహా మున్సిపల్ అధికారులు నీళ్లు నమిలారు. డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ నాగేంద్రబాబు 'సాక్షి'తో మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.16 కోట్లు అమరావతికి మళ్లించారన్నారు. పురం అభివృద్ధికి ఆ నిధులు వెచ్చించి ఉంటే ఎంతో అభివృద్ధి జరిగేదన్నారు.

ఫ్యాన్ గుర్తుపై గెలిచి అమ్ముడుపోయారు

ఫ్యాన్ గుర్తుపై గెలిచిన కౌన్సిలర్లు టీడీపీకి అమ్ముడుపోయారని వైస్ చైర్మన్ జబీవుల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిరాయింపు కౌన్సిలర్లు బాలకృష్ణను పొగడ్తలతో ముంచెత్తడానికి తప్ప ఎందుకూ పనికిరారని మండిపడ్డారు.

తప్పుడు లెక్కలు చూపడం సిగ్గుచేటు



ప్రజలకు వాస్తవాలు చూపలేక అంకెల గారడీతో మభ్య పెట్టాలని టీడీపీ చూడటం సిగ్గుచేటు. మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ మొత్తం తప్పుల తడకగా ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్కో వార్డుకు రూ.20 లక్షలను అభివృద్ధికి కేటాయిస్తే వాటిని వెనక్కి తీసుకున్న దౌర్భాగ్య ప్రభుత్వమిది. హిందూపురం అభివృద్ధికి రూ.వందల కోట్లు కేటాయిస్తామని ఎమ్మెల్యే బాలకృష్ణ ఒట్టి మాటలు చెబుతున్నారు. పురం బడ్జెట్‌లో కేంద్రం నిధులు తప్ప రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఎక్కడ కేటాయించింది. ప్రజలు వాస్తవాలు గమనిస్తున్నారు. కమీషన్ల కోసం అంచనాల కంటే ఎక్కువ నిధులు పొందేందుకు టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారు.

– టీఎస్ దీపిక, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త , హిందూపురం

మద్యం దుకాణం సీజ్

చిలమత్తూరు: మండల కేంద్రంలోని మద్యం దుకాణాన్ని ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. నకిలీ మద్యం వ్యవహారంలో ఇప్పటికే పలువురు అరెస్ట్ అయ్యారు. దర్యాప్తులో భాగంగా చిలమత్తూరు మద్యం దుకాణాన్ని సీజ్ చేసినట్లు తెలిసింది.

పనులకు వచ్చేలా కూలీలకు అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామారావు

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పనులు చేయడానికి వచ్చేలా కూలీలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ రామారావు సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆ శాఖ టీఏ, ఎఫ్ఏలతో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పనులు చేయడానికి వచ్చేలా కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సమీక్ష నిర్వహించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



బాత్‌రూములను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి కృష్ణానాయక్

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుండుమల కేజీబీవీ పాఠశాలలో బాలికల చదువు, మౌలిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని మండల స్పెషల్ ఆఫీసర్ కృష్ణానాయక్ సూచించారు. శుక్రవారం ఆయన కేజీబీవీ పాఠశాలలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం స్టోర్ రూము, వంటగది, మరుగుదొడ్లు గదులను పరిశీలించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కన్నడ పండుగకు ఆహ్వానం



ఎమ్మెల్యే వెంకటేశ్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న దృశ్యం

పావగడ: కర్ణాటక ప్రెస్‌క్లబ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న అమెరికా దేశంలోని న్యూయార్క్‌లో జరిగే అతిపెద్ద 3వ విశ్వ కన్నడ వేడుకలకు హాజరు కావాలని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు టి శివకుమార్ స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్‌కు శుక్రవారం ఆహ్వాన పత్రిక అందించారు. ఆహ్వాన పత్రిక అందుకున్న ఎమ్మెల్యే వెంకటేశ్ .. వేడుకలకు హాజరవుతానని పేర్కొన్నారు.

కేజీబీవీ పరిశీలన

రొళ్ల: బాలికలు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని పెనుకొండ డీఎల్‌పీఓ, మండల స్పెషల్ ఆఫీసర్ శివ సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం మండల పరిధిలోని ఆవినకుంట వద్ద ఉన్న కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేశారు. తర్వాత విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం రొళ్ల కొండ గ్రామ సమీపంలోని సంపద తయారీ కేంద్రాన్ని కూడా సందర్శించారు.

సామాజిక న్యాయంతోనే దేశాభివృద్ధి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి మాదేశ్

పావగడ: సామాజిక న్యాయంతోనే దేశాభివృద్ధి సాధ్యమని, మహిళలు, పురుషుల మధ్య ఎలాంటి తారతమ్యత లేకుండా కలసికట్టుగా పని చేయాలని స్థానిక జేఎంఎఫ్‌సీ సీనియర్ సివిల్ న్యాయమూర్తి వి మాదేశ్ సూచించారు. స్థానిక కస్తూర్బా వసతి పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన విశ్వ సామాజిన న్యాయం, విశ్వ బాల కార్మిక నిర్మూలన దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఈఓ ఇంద్రాణమ్మ , బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషానందన్ , ప్యానల్ న్యాయవాది దివ్య, కార్మికశాఖ అధికారి హరీష్ కుమార్, కస్తూర్బా వసతి శాల హెచ్ఎం సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలు

అగళి: మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఆరు తరగతి ప్రవేశాలకు ఈ నెల 24 నుంచి మార్చి 31 వరకూ అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ జాఫర్ ఒక ప్రకటనలో తెలిపారు.

సందడిగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థిని

లేపాక్షి: మండలంలోని శిరివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం సందడిగా జరిగాయి. మొదట విద్యార్థులు సరస్వతీ పూజలో పాల్గొన్నారు. అనంతరం భరత నాట్యం, జానపద గేయాలు, సామాజిక సన్నివేశాలు లాంటి సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పాలిటెక్నిక్, జేఎన్‌టీయూ అధ్యాపకులు శ్రీరామచంద్రరావు, శ్రీలక్ష్మి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. హెచ్ఎం రవిశంకర్, పీడీ సంపత్‌కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పావగడ: తాలూకాలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 66–11 కేవీ పరిధిలోని పావగడ, వెంకటాపుర, శైలాపుర, నాగలమడక, మంగలవాడ, కిలార్లహళ్లి, లింగదహళ్లి, వైఎన్ హొసకోటతో పాటు 220–66–11 కేవీ పావగడ ఉప కేంద్రాల్లో పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు.

రైతుల సమస్యలపై నిరసన



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

మడకశిరరూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24, మార్చి 3వ తేదీల్లో రైతు సమస్యలపై రెవెన్యూ కార్యాలయాలు, సచివాలయాల వద్ద రైతులతో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు సోమ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం బుళ్లసముద్రం గ్రామంలో నిరసన కార్యక్రమంపై రైతులతో సమావేశం నిర్వహించి చర్చించారు. అనంతరం పోస్టర్లును విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.